# దర్గామిట్ట కతలు

## చోంగా బుత్తీ షక్కర్ షర్బత్




చోంగా అంటే చక్కెర అప్పడం.

బుత్తీ అంటే పెరుగన్నం.

షక్కర్ అంటే చక్కెర.

షర్బత్ అంటే పాల పావకం.

పీర్ల పండగ వచ్చిందంటే ఈ నాలుగూ కంపల్సరి మా యిళ్ళల్లో. చోంగా బుత్తీ షర్బత్ యింట్లో తినడానికి. షక్కర్ పీర్ల సావిట్లో 'ఫాతేహా'(సదివింపులు) యివ్వడానికి.

మా యిళ్లల్లో బిడ్డ వుట్టినా మనిషి పోయినా పండగొచ్చినా పలావు దబర పొయ్యి మీదకెక్కద్దని అనుకుంటా ఉంటారు కదా, పీర్ల పండక్కి మాత్రం ఆ లెక్కేమీలా.

అది హసేన హుసేన వీరమరణాలకు గుర్తుగా చేసుకునే విషాద పండగ కాబట్టి మావునం అనే మాటే మా యిళ్లల్లోకి రాదు. అట్నే కొత్త గుడ్డలు కూడా కుట్టించుకోము. రంజానుకీ, బక్రీదుకీ అందరం యీద్గాకు వెళ్లి నమాజు చేసినట్టుగా ఈ పండక్కి చేయము. చోంగా నమిలి, బుత్తీ తిని, షర్బత్ తాగి గమ్మగా ఉండిపోతాం.

అట్టాగని యీ పండక్కి కళేమీ లేదని గాదు.

అసలికి కళంతా ఉండేది ఈ పండగలోనే- పీర్ల సావిడి కాడ. యిష్ణాలయం వీదిలోని పీర్ల సావిడిలో పీర్లను కూచోబెట్టినప్పట్నించీ సాయంత్ర మయ్యిందంటే చాలు పిలకాయల మందరం అణ్నే చేరేవాళ్లం. ఒకతట్టు కుందుడు గుమ్మ, 'చీర్' ఆట ఆడుకుంటానే యింకోతట్టు ఎవురెవరు వచ్చి 'ఫాతేహా' చేయిస్తా ఉన్నారా అని గమనించు కుంటా ఉండేవాళ్లం. ఎందుకంటే కొంతమంది ఫాతేహా చేసినాక ప్రసాదం తీసకొచ్చి మాకే పంచి పెట్టేసే వాళ్లు! చక్కెర, బెల్లం గెడ్డలు, పచ్చి కజ్జూరం, బూంది- ఒకోరు ఒకోటి.

సావిట్లో పీర్లను కూచోబెట్టే పది రోజుల ముందర మంచే పీర్ల సాయిబు చందా పుస్తకం తీసుకోని బయలు దేరతాడు ఊరిమీదకు. తెల్లగా, ఎత్తుగా, యింత పొడుగు గెడ్డంతో ఉండే ఆ ముసలా యన్ను చూడగానే ఉత్త సాయిబులే కాకుండా హిందువులు కూడా గమ్మున చదివించేసే వారు చందా. మా నాయినయితే యిరవై రూపాయలు యిచ్చేసేవాడు టంచనుగా ప్రతి సమచ్చరం.

చందా డబ్బులు పోగయ్యే కొద్దీ పీర్ల సావిడికి కళ.

సున్నాలు కొట్టించడం, పీర్లకు ఆకు పచ్చం గుండే జలతారు గుడ్డలు తీసకరావడం, మల్లె పూల దండలు చుట్టబెట్టడం, సీరియల్ సెట్లు, సామ్రాణీ కడ్డీలు, అత్తరు...

పీర్లన్నీ వరుసగా, ప్రాణం పోసుకున్న మనుషుల్లాగా కొలువు తీరి ఉంటే మా పిలకాయలందరికీ బలే బయంగానూ బక్తిగానూ ఉండేది. పీర్ల నడిమధ్యన ఉండే 'హటేల్‌సా' పీరును చూసినామంటే మా అందరికీ హడలే. ఆ పీరు యిత్తడి రేకుతో గుండ్రంగా చాటంత ఎడల్పుగా ఉండి నెత్తిన రెండు కొమ్ములతో బీకరంగా ఉండేది. యమా శక్తిమంతులైన వాళ్లకే ఆ పీరు ఒంట్లోకొస్తుందని పెద్దోళ్లు చెప్తా ఉండేవాళ్లు. ఊరేగింపులో దాన్ని మోసేవాళ్లు కూడా బలే స్ట్రాంగుగా వుండేవాళ్లు.

పీర్ల పండగ వచ్చిన ప్రతీసారీ మా యిళ్లల్లో మా కరీముల్లా మామే హీరో!

మా అమ్మకు పెద్ద తమ్ముడైన కరీముల్లా మామ తప్ప యింకెవురూ మా తట్టు 'గుండం' తొక్కే వాళ్లు కాదు. మా అమ్మ తట్టు బంధువుల్లోనే యింకా వజీర్ మామ, బషీర్ మామ గుండం తొక్కేవాళ్లు గానీ మా నాయిన తట్టు ఒక్కరూలా. వుట్టి బుద్దెరిగినాక మా నాయిన ఒక్కసారి కూడా గుండం తొక్కలేదంట!

పీర్లు కూచోబెట్టిన ఎనిమిదో రోజున, తొమ్మిదో రోజున వరుసగా రెండు రోజులు తొక్కుతారు గుండాన్ని. అబ్బో! ఆ రెండు రోజులు ఉంటుంది సామీ కళ. చెప్పనలవి గాదు.

సాయంత్రం కాక ముందరే పెద్ద పెద్ద ఎండు మొద్దులు తీసకొచ్చి వడేస్తారు గుండంలో. అవి కాలీ కాలీ రాత్రి తొమ్మిదిన్నరా పదికంతా ఎర్రెర్రటి నిప్పలయి పోతాయి. అప్పుడు పీర్ల సాయిబు వచ్చి ఒక పెద్ద కర్రతో ఆ నిప్పలన్నింటినీ సదరం చేసి గుండం అంతా పరచుకునేలా చేస్తాడు. యింక తొక్కడానికి గుండం రెడీ అన్నమాట.

అప్పటికి అన్నాలు తినే టయిము కూడా అయిపోయి ఉంటుంది కాబట్టి పిలకాయలు, ఆడోళ్లు, మొగోళ్లు అందరూ అన్నాలు తినేసొచ్చి, ఆకొక్క నమలతా గుండం దెగ్గిర కూచుంటారు గుండం తొక్కేది చూడటానికి. కాసేపటికి ఊర్లో కెళ్లిన పీర్లన్ని తప్పెట్ల మోతతో గుండం కాడికి చేరుకుంటాయి. మా కరీముల్లా మామతో నహా పీర్లు మోస్తా ఉన్న పెద్దోళ్లంతా అదో మాదిరి వూన



కంలో ఉన్నట్టుగా ఉంటారు. వాళ్ల ఒంటి మీద బనీను, గోసిపాత తప్పితే యింకేమి ఉండవు. మా అమమ్మ తాత మా కరీముల్లా మామకు చెరో వక్కా నిలబడి, రెక్కలు పట్టుకొని కంట్రోలు చేస్తా ఉంటారు ఊపుని. గుండం తొక్కబోయే వాళ్ళందరి మీదా బిందెడేసి నీళ్లు కుమ్మరిస్తారు ఎవురో ఒకరు.

అప్పుడింక తప్పెట్ల మోత యింకాస్త పెచ్చు పెరుగుతుంది. అందరం కళ్ళు యింతింత చేసుకొని గుండం తట్టే చూస్తా ఉంటాం.

ఫస్టు పీరుని పీర్ల సాయిబు బుజానికెత్తుకొని 'దీన్' మని రంకె వేస్తా గుండంలోకి దిగుతాడు. ఆయన దిగంగానే మోసేవాళ్లకూ చూసేవాళ్లకు కూడా వూనకం వచ్చేస్తుంది.

'దీన్' 'దీన్' అందరం పెద్దగా రంకెలేస్తాం.

పీర్లు మోస్తా వున్న వాళ్లు ఒళ్లు పోదీనం తప్పినోళ్లలాగ పెద్ద పెద్ద అంగలేస్తా, నిప్పులు తొక్కతా, గుండం మీద .మంచి నడిచెళ్లిపోతారు ఈ వక్క మంచి ఆ వక్కకి. ఆ వక్క మంచి ఈ వక్కకి. అట్లా మూడు చుట్లు తిరగతారు. వాళ్లు తిరిగినంత సేపు దీన్‌దీన్‌మని అరుపులు వినిపిస్తానే వుంటాయి.

పీర్లు కూచోబెట్టిన పదోరోజు 'షహాదత్.'

ఆరోజు గుండం తొక్కేదుండదు. ఊరేగింపు, జల్సా.

ఎడ్లబండికి రంగు కాయితాలతో డెకరేషను చేసి పీర్లన్నింటినీ బండెక్కేస్తాడు పీర్ల సాయిబు. ముందు తప్పెట్లు కొట్టే మాదిగోళ్లు, వాళ్ల దరువుతో సరి సమానంగా డ్యాన్సాడే వులేషగాళ్ళు రెడీ అయిపోతారు. నల్లటి మసి పూసుకొని, యింతింత పెద్ద గుడ్డరొమ్ములు పెట్టుకొని, ఒక చేతిలో పాత చాట, యింకో చేతిలో పాత చీపిరి పట్టుకొని రాకాసి ఆడామె వేషంలో అందర్నీ తన్నే మిషను తొక్కే మీరా సాయిబు పిలకాయలనీ ఆడోళ్లని బలే నవ్విపిస్తాడు. యింక వ్యాటూ డ్రమ్ము మీద సినిమా పాటలేసే యానాదోళ్ల మోతకైతే వీదులన్నీ మోతెక్కి పోయి జనం యిరగబడతారు చూడ్డానికి.

ఊరేగింపు ఒకో వీదిలో అడుగుపెడతా ఉంటే బిందెలతో నీళ్లు కుమ్మరించి స్వాగతం చెప్తా ఉంటారంతా. పెద్దోళ్లు సావకం, చక్కెర తీసకెళ్లి 'ఫాతెహా' చేయిస్తా ఉంటే పిలకాయలం వులేషం కాడ చేరతాం. బలే ఊపు మీదుంటుంది వులేషం. మా ఊర్లోని 'మైక్ సెట్ రసూల్ సాయిబు' వులేషం కట్టినాడంటే అదిరి పోవాల్సిందే. నల్లగా యింత పొడుగున అమితాబ్‌బచన హిస్టీక్రావుతో వుండేవాడాయన. నోటిలో నిమ్మకాయ పెట్టి, నెనక మోకులేసి కట్టి ఆయన చేత వులేషం వేయించేవాళ్లు మొగోళ్లు.

రాత్రంతా వులేషాలతో పాటలతో అన్నీ వీదులూ తిరిగినాక తెల్లారే పాటికి సాపిరెడ్డి చెరువు కాడికి చేరతాయి పీర్లు. వూరేగింపు ముగించి వాటినాడ ముంచడంతో పీర్ల పండగ పూర్తవుతుంది.

ఆ తర్వాత పీర్లన్ని చెక్క పెట్టెలో చేరి పీర్ల సావిట్లోని ఆటక మీద కెక్కుతాయి.

అంతదాకా అన్ని పనులు దగ్గరుండి చేసిన పీర్ల సాయిబు సావిటికి తాళం వేసి మళ్లా పనుల్లోకి పడతాడు.

సావిడి బోసి పోతుంది.

సున్నం వెలిసి పోతుంది.

మళ్లీ పీర్ల పండగ ఎప్పుడొస్తుందా అని పిలకాయలందరం ఎదురు చూస్తా ఉంటాము ఆ దారిన పోయినప్పుడల్లా. చక్కెర తినడానికి. సావిడి ముందర గోలగా ఆడుకునేదానికి.

*

( నేను యిప్పటి వరకూ చెప్పిన కతంతా నేను పుట్టక ముందుదీ నేను పుట్టినాక ఎనిమిదో కిలాసు వరకు జరిగినదీ. నేను ఎనిమిదో కిలాసులో ఉండగా పాపం పీర్ల సాయిబు చని పోయినాడు. ఆయనుండగా బతిమాలో, ఒప్పించో అందరి దగ్గర చందాలు వసూలు చేసి గనంగా చేసేవాడు పీర్ల పండగ. ఆయన పోయినాక ఆయన తరుపోళ్లు చేస్తా ఉన్నారు గానీ ఒక కళ లా. ఒక కాంతి లా. మొద్దులు కాల్చేదీలా. గుండం తొక్కేదీలా. అంతా మొక్కుబడి యవ్వారమే. మా ఊర్లో గుండం తొక్కి పది హేనేళ్లు కావస్తా ఉందంటే మా ఊరి సాయిబులు కళా కాంతులు లేని యిట్లాంటి ఖర్మ బతుకు బతుకుతున్నారేమిరా అని బలే బాదగా అనిపిస్తా ఉంటుంది.)

–మహమ్మద్ ఖదీర్‌బాబు